# చెన్నైకి చెక్ పెట్టిన సన్‌రైజర్స్..!

ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ మళ్లీ గర్జించింది. గత మ్యాచ్‌లో రాజస్థాన్‌పై చెలరేగిన బౌలర్లు ఈసారి పంజా విసరడంతో చెన్నై సూపర్ కింగ్స్‌ను అలవోకగా ఓడించింది. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ(59), క్లాసెన్(59) అర్ధ శతకాలతో విరుచుకుపడగా.. ఇషాన్ మలింగ(329), నితీశ్ రెడ్డి(231)లు బంతితో రాణించారు. భారీ ఛేదనలో టాపార్డర్ విఫలమైనా ఆయుశ్ మాత్రే(30), శివం దూబే(21) పోరాడినా సీఎస్కేను గెలపించలేకపోయారు. మూడో విజయంతో ప్లే ఆఫ్స్ ఆశలు నిలబెట్టుకుంది ఆరెంజ్ ఆర్మీ. పంతొమ్మిదో సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మూడో విజయంతో మురిసింది. సొంత మైదానంలో బ్యాటర్లు, బౌలర్లు రాణించగా రెండు విజయాలతో జోరుమీదున్న చెన్నై సూపర్ కింగ్స్‌ను మట్టి కరిపించింది. భారీ ఛేదనను ధాటిగా మొదలెట్టిన చెన్నై సూపర్ కింగ్స్‌ను నితీశ్ రెడ్డి(2–31) ఆదిలోనే దెబ్బ కొట్టాడు. ఫామ్ అందుకున్న శాంసన్(7)ను ఔట్ చేసి అతడు బ్రేకివ్వగా.. ఇంప్యాక్ట్ సబ్ ఆయుశ్ మాత్రే(30) వస్తూనే గత మ్యాచ్ హీరో ప్రఫుల్ హింగేను ఉతికేస్తూ ఐదు ఫోర్లు రాబట్టాడు. ధాటిగా ఆడుతున్న మాత్రేను క్లాసెన్ డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ పంపాడు.. కాసేపటికే రుతురాజ్ గైక్వాడ్(19)ను ఇషాన్ మలింగ(3–29) వెనక్కి పంపాడు. సర్ఫరాజ్ ఖాన్(25) సైతం ఔటవ్వగా.. డేంజరస్ డెవాల్డ్ బ్రెవిస్‌ను ఔట్ చేసి శివాంగ్ ఐదో వికెట్ అందించాడు. అనంతరం.. మాథ్యూ షార్ట్(34) జతగా శివం దూబే(21) జట్టును గెలిపించేందుకు ప్రయత్నించాడు. కానీ, అనికేత్ వర్మ సూపర్ క్యాచ్ పట్టడంతో షార్ట్ ఆరో వికెట్‌గా డగౌట్ చేరాడు. అయినా దూబే క్రీజులో ఉండడంతో గెలుపుపై ధీమాతో ఉన్న చెన్నై ఆశలపై షకీబ్ నీళ్లు చల్లాడు. 17వ ఓవర్లో దూబేను బౌల్డ్ చేసిన ఈ యంగ్‌స్టర్ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. నితీశ్ ఓవర్లో అన్షుల్ (12) సిక్సర్ బాదగా ఆఖరి ఓవర్లో చెన్నై విజయానికి 18 పరుగులు అవసరమయ్యాయి. ప్రఫుల్ వికెట్ తీసి రన్స్ మాత్రమే ఇవ్వడంతో సన్‌రైజర్స్ 10 పరుగుల తేడాతో గెలుపొందింది.

### దంచేసిన అభిషేక్, క్లాసెన్..

ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(59) వేగవంతమైన అర్ధ శతకంతో చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లపై విరుచుకుపడగా.. మిడిల్ ఓవర్లలో హెన్రిచ్ క్లాసెన్(59) ఉతికేశాడు. వీరిద్దరి మెరుపులతో రెండొందలకు పైగా కొట్టేలా కనిపించిన సన్‌రైజర్స్‌ను సీఎస్కే గొప్పగా కట్టడి చేసింది. అన్షుల్ కంబోజ్(3–22), జేమీ ఓవర్టన్ (3–37) డెత్ ఓవర్లలో వికెట్ల వేటతో హైదరాబాద్‌ను 194కే పరిమితం చేసింది చెన్నై.

# ఉత్కంఠ పోరులో ఢిల్లీదే గెలుపు

**వందో మ్యాచ్‌లో ఆర్‌సిబికి షాక్.. ఢిల్లీని గెలిపించిన మిల్లర్..!**

చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సిబి) జైత్రయాత్ర ముగిసింది. వందో మ్యాచ్‌లో విజయంతో మురవాలనుకున్న ఆర్‌సిబికి ఢిల్లీ క్యాపిటల్స్ చెక్ పెట్టింది. 176 పరుగుల ఛేదనలో భువనేశ్వర్(3–26) ధాటికి కష్టాల్లో పడిన ఢిల్లీని ట్రిస్టన్ స్టబ్స్(60 నాటౌట్), కేఎల్ రాహుల్(57) అర్ధ శతకాలతో ఆదుకున్నారు. ఆఖరి ఓవర్లో 14 రన్స్ అవసరమవ్వగా.. డేవిడ్ మిల్లర్(22 నాటౌట్) రెండు సిక్సర్లు, ఫోర్‌తో గెలిపించాడు. ఆరు వికెట్ల తేడాతో గట్టెక్కిన ఢిల్లీ మూడో విజయం నమోదు చేసింది. పంతొమ్మిదో సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ మూడో విజయంతో మురిసింది. చిన్నస్వామి స్టేడియంలో చివరి ఓవర్ వరకూ ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో ఆర్‌సిబిపై 6 వికెట్లతో జయభేరి మోగించింది ఢిల్లీ. కెఎల్ రాహుల్(57), ట్రిస్టన్ స్టబ్స్(60 నాటౌట్) అర్ధ శతకాలతో మెరవగా.. ఆఖర్లో డేవిడ్ మిల్లర్ ఈసారి ఏ పొరపాటు చేయకుండా గెలిపించాడు.తొలుత బెంగళూరును 175కే కట్టడి చేసిన ఆనందం ఢిల్లీ క్యాపిటల్స్‌కు మిగల్లేదు. తొలి ఓవర్లోనే భువనేశ్వర్(3–26) ఢిల్లీకి ఊహించని ఝలక్ ఇస్తూతొలి ఓవర్లోనే డేంజరస్ పథుమ్ నిశాంక(1)ను వికెటల్ ముందు దొరకబుచ్చుకున్నాడు. తన రెండో ఓవర్లో ఢిల్లీని మరింత కష్టాల్లోకి నెట్టాడు.

ఇంప్యాక్ట్ సబ్ కరుణ్ నాయర్(5), సమీర్ రిజ్వీ(2)లను ఔట్ చేసిన భువి.. బెంగళూరుకు అవకాశాలు సృష్టించాడు.

### నిలబడిన రాహుల్, స్టబ్స్

ఆరంభంలోనే మూడు వికెట్లు పడిన ఢిల్లీని కేఎల్ రాహుల్(57), ట్రిస్టన్ స్టబ్స్(60 నాటౌట్) ఆదుకునే పనిలో ఉన్నారు. హేజిల్‌వుడ్ వేసిన ఓవర్లో రెచ్చిపోయిన రాహుల్ 6, 4, 4 తో స్కోర్ 40 దాటించాడు. పవర్ ప్లేలో ఢిల్లీ మూడు వికెట్ల నష్టానికి 50 పరుగులు చేసింది. సుయాశ్ శర్మ ఓవర్లో వరస బౌండరీలతో.. ఈ ద్వయం 31 బంతుల్లో 50 రన్స్ జోడించింది. అర్ధ శతకం తర్వాత స్పీడ్ పెంచాలనుకున్న రాహుల్‌ను కృనాల్ పాండ్యా తెలివిగా ఔట్ చేసి ఆర్‌సిబిని పోటీలోకి తెచ్చాడు. అనంతరం గెలుపు బాధ్యత తీసుకున్న స్టబ్స్.. సుయాశ్ ఓవర్లో బౌండరీలతో చెలరేగాడు. అయితే.. అక్షర్ పటేల్(26) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగడంతో క్రీజులోకి వచ్చిన డేవిడ్ మిల్లర్(22 నాటౌట్).. భువి ఓవర్లో సిక్సర్, ఆపై రసిక్ ఓవర్లో బౌండరీలతో సమీకరణం 10 బంతుల్లో 20 పరుగులుగా మారింది. షెపర్డ్ సంధించిన మూడు, నాలుగు బంతులను సిక్సర్లుగా మలిచిన మిల్లర్ ఐదో బంతికి బౌండరీ రాబట్టాడు. అంతే.. సొంతగడ్డపై ఆర్‌సిబి చిత్తవ్వగా.. ఢిల్లీ విజయంతో మురిసింది. సొంత మైదానంలో వందో మ్యాచ్ ఆడుతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అంచనా తప్పింది. భారీ స్కోర్‌తో ఢిల్లీ క్యాపిటల్స్‌ను భయపెట్టాలనుకున్న ఆర్‌సిబికి ప్రధాన బ్యాటర్లు షాకిచ్చారు. ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లీ(19) తేలిపోగా.. ఓపెనర్ ఫిలిప్ సాల్ట్(63) ఒక్కడే అర్ధ శతకంతో మెరిశాడు. అక్షర్ పటేల్(2–18), కుల్దీప్ యాదవ్(2–32) తిప్పేయగా.. మిడిలార్డర్ డగౌట్‌కు క్యూ కట్టింది. డెత్ ఓవర్లలో దంచేయాలనుకున్న హిట్టర్లను నట్టూ, ఎంగితి అద్భుతంగా నియంత్రించారు. దాంతో, బెంగళూరు నిర్ణీత ఓవర్లలో 8 నష్టానికి 175 పరుగులు చేసిందంతే.

# 'హోమ్ లోన్' ఎక్కువగా రావాలంటే

ఇటీవల కాలంలో చాలా మందిలో సొంతింటి ఆలోచన పెరిగింది. ఈ కలను సాకారం చేసుకునేందుకు ఎంతో శ్రమిస్తుంటారు. అయితే, ఇంటి పనిలోకి దిగాక ఖర్చు అంచనా వేసిన దాని కంటే ఎక్కువగా అవుతుంటుంది. అప్పుడు చాలా మందికి ముందుగా గుర్తొచ్చేవి 'హోమ్ లోన్స్'. ఇందుకు తగ్గట్టే బ్యాంకులు, హోమ్ లోన్ కంపెనీలు రుణాలు ఇస్తుంటాయి. అయితే, మీరు తీసుకునే హోమ్ లోన్ అవసరమైనంత రావాలంటే ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే లోన్ మొత్తం పెరుగుతుందో ఈ స్టోరీలో తెలుసుకుందాం. కొత్తగా ఇల్లు కట్టుకోవాలనే ఆలోచనలో ఉన్నవారు కొన్ని టిప్స్‌తో కావాల్సినంత హోమ్ లోన్ పొందవచ్చంటున్నారు ఆర్థిక నిపుణులు. అలాంటి వాటిల్లో కొన్నింటిని ఇప్పుడు చూద్దాం. ప్రస్తుతం మీరు ఎలాంటి లోన్స్ తీసుకోవాలన్నా క్రెడిట్ స్కోర్ అనేది కీలకంగా మారింది. ముఖ్యంగా లోన్ల విషయంలో బ్యాంకులు లేదా హోమ్ లోన్ సంస్థలు ముందుగా క్రెడిట్ స్కోర్ చూస్తాయి. దీనితో మీ క్రెడిట్ హిస్టరీ, మీ ఆర్థిక అలవాట్లను పరిశీలిస్తాయి. అప్పుడు మీ క్రెడిట్ స్కోర్ 750+ లేదా అంతకంటే ఎక్కువ ఉంటే మీకు కావాల్సినంత హోమ్ లోన్ ఈజీగా వస్తుందంటున్నారు నిపుణులు. అలాగే, వడ్డీ రేటు కూడా తగ్గే ఛాన్స్ ఉంటుంది. మీ క్రెడిట్ స్కోర్ 800 దాటితే వడ్డీలో 0.5 శాతం వరకు తగ్గింపు కూడా లభిస్తుందని చెబుతున్నారు. ఇప్పటికే ఉన్న రుణాలకు సంబంధించిన ఈఎంఐలు, క్రెడిట్ కార్డు బిల్లులు సకాలంలో

చెల్లించడం ద్వారా మంచి క్రెడిట్ స్కోర్ సాధించవచ్చంటున్నారు.

**జాయింట్ లోన్ :** మీ కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తుంటే జాయింట్ లోన్ తీసుకోవచ్చు. దీని వల్ల ఎక్కువ మొత్తంలో లోన్ దక్కుతుంది. ఈ లోన్ మీ జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు ఎవరితోనైనా కలిసి తీసుకోవచ్చు. ఇలా జాయింట్ లోన్ తీసుకోవడం వల్ల హోమ్ లోన్ త్వరగా రావడమే కాదు ఈఎంఐ భారం కూడా తగ్గుతుందంటున్నారు నిపుణులు. అలాగే, ఇద్దరికి ఆదాయపు పన్ను మినహాయింపు కూడా లభిస్తుందని చెబుతున్నారు.

**ఎక్కువ వ్యవధి ఉండేలా :** మీకు పెద్ద మొత్తంలో లోన్ కావాల్సినప్పుడు తిరిగి చెల్లించే వ్యవధిని కూడా వీలైనంత ఎక్కువకాలం ఉండేలా చూసుకోవాలంటున్నారు. దీని వల్ల ఈఎంఐ భారం తగ్గి లోన్ మొత్తం పెరుగుతుందని సూచిస్తున్నారు. అయితే, ఇలాంటి టైమ్‌లో వడ్డీ మాత్రం కాస్త అధికంగానే ఉంటుందని గుర్తుంచుకోవాలి.

**తక్కువ ఇఎంఐ :** హోమ్ లోన్ ఎక్కువ మొత్తంలో రావాలంటే మీకు ఉన్న ఇతర అప్పులను క్లియర్ చేసుకోవడం బెటర్. ఇప్పటికే ఉన్న ఈఎంఐలు కొత్త లోన్‌కు అడ్డంకిగా మారే అవకాశం ఉంటుంది. ఇంకా క్లియర్‌గా చెప్పాలంటే ఆదాయంలో 40 శాతానికి మించి ఇఎంఐ లు లేకుండా చూసుకోవాలి. మరీ తప్పనిసరి అయితే 50 శాతం వరకు ఈఎంఐలు ఉండొచ్చు.

**ఇతర ఆదాయ మార్గాలు :** మీకు జీతంతోపాటు ఇతర ఆదాయ మార్గాలు ఉంటే వాటిని కూడా బ్యాంకుకు తెలియజేయాలి. అంటే ఉదాహరణకు ఇంటి రెంట్లు, బిజినెస్, వ్యవసాయం, వడ్డీలు ఇలా అన్ని రకాల ఆదాయ మార్గాలను లోన్ అప్లికేషన్‌లో పేర్కొనాలి. ఇవి కూడా మీరు లోన్ మొత్తం పెంచుకునేందుకు చాలా బాగా ఉపయోగపడతాయంటున్నారు ఆర్థిక నిపుణులు. హోమ్ లోన్ అనేది సుదీర్ఘకాలం కొనసాగుతుంది. ఇది రుణగ్రహీత ఆర్థిక భవిష్యత్తును, ఆదాయాన్ని ప్రభావితం చేస్తుంది. కాబట్టి, హోమ్ లోన్ తీసుకునేవారు ఒకటికి రెండు సార్లు ఆలోచించి అవసరమైనంత మేరకే లోన్ తీసుకోవడం బెటర్ అంటున్నారు. అలాగే, పత్రాల విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. బ్యాంకులు లోన్ మంజూరు కోసం అనేక పత్రాలపై సంతకం తీసుకుంటాయి. అందుకే, సంతకం చేసే ముందు అన్ని పత్రాలను వివరంగా చదవాలి. నియమ నిబంధనలలో ఉన్న చిన్న పాయింటు కూడా భవిష్యత్తులో మీకు ఇబ్బంది కలిగించవచ్చనే విషయాన్ని గుర్తుంచుకోవాలంటున్నారు నిపుణులు.

# పెట్టుబడి కేంద్రంగా భారత్ ఫ్యూచర్ సిటీ

'టైమ్స్ ఆఫ్ ఇండియా' ప్రాపర్టీ ఎక్స్‌పోలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ముఖ్యంగా హైదరాబాద్ నగరం దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి కేంద్రంగా మారిందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ హైటెక్స్‌లో టైమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'టైమ్స్ ప్రాపర్టీ ఎక్స్ పో 2026' 6వ ఎడిషన్ ప్రారంభ కార్యక్రమానికి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి దిశగా స్పష్టమైన దృష్టితో ముందుకు సాగుతూ, మౌలిక సదుపాయాల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రధానంగా రీజినల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్), గ్రీన్‌ఫీల్ హైవేలు, ఎక్స్‌ప్రెస్ కారిడార్లు, ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్లైఓవర్లు వంటి ప్రాజెక్టులు నగర కనెక్టివిటీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రూ. 40 వేల కోట్లకు పైగా కేటాయించామని, రోడ్స్ అండ్ బిల్డింగ్స్ శాఖ ద్వారా సుమారు రూ.70 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు నగర అభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు, రియల్ ఎస్టేట్ రంగానికి కూడా బలమైన పునాది కల్పిస్తాయని చెప్పారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ స్థిరమైన ధరలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణంతో పాటు ప్రభుత్వ మద్దతుతో దేశంలోనే సమతుల్యంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఒకటిగా నిలుస్తోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రముఖ డెవలపర్లు, పరిశ్రమ నిపుణులు, గృహ కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని గద్దె దించిన రోజునే కార్మికులకు నిజమైన మేడే

సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనుంజయనాయుడు విజ్ఞప్తి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మే1వ తేదీన జరిగే ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు విజ్ఞప్తి చేశారు. శనివారం నేరేడుచర్ల పట్టణంలో సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రమ దోపిడికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా మే 1వ తేదీన మేడే ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుకుంటారని , 8 గంటల పని దినాలు సాధించుకున్న రోజు మేడే అన్నారు. కాని దేశంలో ఇటీవల కాలంలో అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం మళ్లి 10 గంటల పని దినాన్ని అమలు చేస్తున్నదని, ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా కుదించి కార్మిక హక్కులను హరించి వేశారని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సంఘటిత, అసంఘటిత రంగాల్లో ని కార్మికులు ఐక్యమై కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని గద్దె దించిన రోజునే కార్మికులకు నిజమైన మేడే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, మహిళ సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం, చిలకరాజు శ్రీను, పరికె భరత్, శీలం రాంబాబు పాల్గొన్నారు.

## దేశంలో మొట్టమొదటి కార్మిక సంఘం ఎఐటియుసి

ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్

**ప్రజాపక్షం/సిద్దిపేట :** భారతదేశంలోనే మొట్టమొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అని.. కార్మికుల కొరకు కార్మిక చట్టాలు కొరకు, కార్మిక హక్కుల కొరకు ఏన్నో పోరాటాలు చేసి చట్టాలను, హక్కులను సాధించిన ఘనత ఎఐటియుసికే దక్కుందని ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ అన్నారు. శనివారం సిద్దిపేట ఎల్ల సిపిఐ జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏన్నో పోరాటాలు. ప్రాణ త్యాగాలు చేసి కార్మికుల కొరకు సాధించిన హక్కులను కేంద్రం ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి ఏప్రిల్ ఒకటి నుండి అమలు చేస్తుందన్నారు. దీంతో కార్మికుల హక్కులు హరించుకోయే ప్రమాదం ఉందన్నారు. ఎనిమిది గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచుతున్నారని, కార్మికుల సంఘం పెట్టుకొని హక్కును సైతం లేకుండ చేస్తున్నారన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు అయ్యేంతవరకు కార్మికులందరు పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. 141వ మేడేను సిద్దిపేట జిల్లాలో ఎఐటియుసి కార్మిక సంఘం అనుబంధంగా ఉన్న కార్మికులందరు గ్రామాల్లో. మండలాల్లో. ఎఐటియుసి జెండాను ఎగురవేయాలన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో మేడే రోజున బైక్ ర్యాలీని పెద్ద ఎత్తున నిర్వహిస్తునట్లు తెలిపారు. కార్మికులందరు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో ఎఐటియుసి పట్టణ అధ్యక్షులు చెక్క బాలయ్య, నాయకులు గంగిరాజు గోవిందారం బాలయ్య, చింతమడ్క రాజు, మల్లయ్య, యాదగిరి. సంపత్, ఐలయ్య, మౌలాన, తిరుపతి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత హక్కుల పరిరక్షణ కోసం సమరశంఖం

దళిత రైట్స్ మూవ్‌మెంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.నిర్మల్

**ప్రజాపక్షం/వరంగల్ :** దేశంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో, రాజ్యాంగబద్ధమైన హక్కులను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని దళిత రైట్స్ మూవ్‌మెంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.నిర్మల్ ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ అబ్బూన్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) తెలంగాణ రెండవ మహాసభను ప్రారంభిస్తూ ఆయన ప్రసంగించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై, గిరిజనులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాలలోనే దళితులు, గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దళితులపై దాడులను అరికట్టడంలో ఎన్‌డిఎ, బిజెపి పాలకులు విఫలమయ్యారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ పెండింగ్‌లో ఉన్న నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. దళితులకు కేటాయించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన మండిపడ్డారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం సక్రమంగా అమలు కావాలని, బాధితులకు తక్షణ న్యాయం, పరిహారం అందాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధన కోసం గ్రామ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని జాతీయ ప్రధాన కార్యదర్శి హెచ్చరించారు.

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనర్సింహ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఏసు రత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్‌కుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సంగి ఎలేందర్, ప్రధాన కార్యదర్శి జన్ను రవి, తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాల నుండి వచ్చిన నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలైనా పెంచండి.. జైల్లోనైనా పెట్టండి

- ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు పెంచాలి
- 21న వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యరంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టర్ కార్మికులకు జీతాలైన పెంచండి లేకపోతే కార్మికులను జైల్లోనైనా పెట్టండని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలోని ఎదిరలోని మహబూబ్ నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విస్తృత సమావేశం జరిగింది. అనంతరం 21న జరిగే ఆందోళన నోటీసును మెడికల్ కళాశాల సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఆసుపత్రులలో ఎలాంటి చట్టబద్ధ హక్కులు లేకుండా ఉద్యోగ భద్రతకు, కనీస వేతనాలకు నోచుకోక దినదిన గండంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2012 సంవత్సరం నుంచి ఇప్పటివరకు లేబర్ జిఒలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సవరణ చేయలేదని కార్మిక చట్టాల ప్రకారం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జిఒలు సవరించి వేతనాలు పెంచాల్సి ఉన్న పాలకుల ఉదాసీనత వైఖరి ఫలితంగా కార్మికులు వెట్టిచాకిరికి గురవుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం జిఒ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లిస్తున్న ఒకే వైద్యరంగంలో ఒకే

జిఒ నెంబర్ 60 ఉన్నప్పటికి కాంట్రాక్టు కార్మికుల వేతనాల చెల్లింపుల్లో భారీ వ్యత్యాసాలు కొనసాగడం అత్యంత బాధాకరమని అన్నారు. ప్రభుత్వ అధినేతలు, అధికారులు ఉద్దేశ్యపూర్వకంగానే అనేక లోసుగులతో కార్మికులకు నష్టదాయకమైన గైడ్లన్స్ రూపకల్పన చేసి ఏజేన్సీ కాంట్రాక్టర్ల జేబులు నింపే విధంగా దశాబ్దాల కాలంగా కొనసాగుతూనే ఉన్నదని ధ్వజం ఎత్తారు. ఐహెచ్ఎంఎస్ ప్రస్తుత ఏజెన్సీల కాలపరిమితి ముగిసి ఏడాది గడుస్తున్న వాటిని రద్దు చేయకుండా పాత ఏజెన్సీలకే గడువు పెంచుతూ అనుమతులు ఇవ్వడం సమంజసం కాదని అన్నారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా కార్మికులకు వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, జాతీయ పండగ ఆర్జిత సెలవులు కాంట్రాక్టు కార్మికులకు వర్తింపచేయాలని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సంవత్సరంలో ఒక నెల వేతనం బోనస్‌గా కార్మికులకు అందించాలని తదితర డిమాండ్లతో ఈనెల 21న హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ వైద్య, విద్య సంచాలకులు తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయాలను వేలాదిమంది ప్రభుత్వ ఆసుపత్రుల కార్మికులతో దిగ్బంధనం చేస్తున్నామన్నారు. చలో హైదరాబాద్‌కు కాంట్రాక్టు పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ కార్మికులు పెద్ద ఎత్తున తరలించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల బ్రాంచ్ యూనియన్ నేతలు కార్మికులు సాయి ప్రకాష్, కె.శ్రీనివాసులు, నరసింహ, నరేష్ శ్రీను, విజయ్ మోహన్ రెడ్డి, గోపి, చిట్టెమ్మ, సత్యమ్మ, సరసమ్మ భీమమ్మ, కృష్ణమ్మ, అనసూయ, యాదమ్మ, మాధవి, వెంకటమ్మ, దేవమ్మ, సుజాత, లక్ష్మి , సావిత్రి, భూదేవి, మంజుల, తిరుపతమ్మ, మన్నెమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి

బిజెపి ఎంపి వ్యాఖ్యలను ఖండించిన ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లాహ్ ఖాద్రీ

**ప్రజాపక్షం/వరంగల్ :** బిజెపి ఎంపి తేజస్వి సూర్య చేసిన బాధ్యతారాహిత్యమైన, అవమానకర వ్యాఖ్యలను ఎఐవైఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని డా. సయ్యద్ వలి ఉల్లాహ్ ఖాద్రి అన్నారు. వరంగల్ పోచమ్మ మైదాన్ కేంద్రంలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ, తేజస్వి సూర్య దిష్టిబొమ్మను దహనం చేశారు